
అద్దంకి నాంచారమ్మ దేవస్థానంలో దుర్గాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు..


పూనూరులో దుర్గాదేవి అలంకరణలో త్రిపురసుందరీ దేవి


చినగంజాం: దుర్గాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు


నూతలపాడులో మహిషాసురమర్దిని అవతారంలో ..

దుర్గమ్మా.. చల్లగా దీవించమ్మా

● నేడు దసరా పండుగ

దసరా శరన్నవరాత్రుల సందర్భంగా సోమవారం అమ్మవారు నేడు మహిషాసురమర్దినీ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. తొమ్మిది రోజుల నుంచి పలు ఆలయాలు రంగుల రంగుల విద్యుద్దీపాలంకరణలో మెరిశాయి. భక్తులు అమ్మవారిని వివిధ రకాల రూపాలల్లో అలంకరించి పూజలు చేశారు. నేడు దసరా పండుగ కావడంతో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటికిటలాడనున్నాయి. దీనికి తగ్గట్టుగా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

- సాక్షి నెట్‌వర్క్


చీరాలలో ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు


బల్లికురవలో కనకదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు


వేటపాలెంలో దుర్గాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు


ఇంకొల్లులో దుర్గాదేవి అవతారంలో అమ్మవారు


కారంచేడు: దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు


చీరాలలో కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న ఋత్విక్ బృందం

వెంకటేష్‌ను పరామర్శించిన కృష్ణచైతన్య


హాస్పిటల్‌లో వెంకటేష్‌ను పరామర్శిస్తున్న కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒంగోలులోని సంఘమిత్ర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న చీరాల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను ఆదివారం రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పరామర్శించారు. పరామర్శించిన వారిలో అద్దంకి మండల, పట్టణ నాయకులు ఉన్నారు.

వెంకటేష్ కోలుకోవాలంటూ ప్రత్యేక పూజలు


గంగమ్మతల్లి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు

చీరాల: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వెంకటేష్ కోలుకోవాలంటూ కరణం వెంకటేష్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం చీరాలలోని గంగమ్మ తల్లి దేవాలయంలో 101 కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్, కరణం వెంకటేష్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

నాగార్పమ్మకు బంగారు హారం బహూకరణ


ఈవోకి బంగారు హారం అందజేస్తున్న దాతలు

వేటపాలెం: రామన్నపేట గ్రామ శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న కనక నాగార్పమ్మ అమ్మవారికి దంత వైద్యుడు సజ్జా కిరణ్‌కుమార్, దీపిక దంపతులు బంగారు హారం ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో జీవీఎల్ కుమార్ మాట్లాడుతూ దాతల కోర్కెలు తీరినందుకు అమ్మవారికి రూ.1.77 లక్షలు విలువగల 28.3 గ్రాముల బంగారు హారం అందజేశారని తెలిపారు. దసరా సందర్భంగా బంగారు హారాన్ని అమ్మవారికి అలంకరింపజేస్తామని తెలిపారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

చినగంజాం: రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని వదలి సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్సై కే సురేష్ సూచించారు. ఆదివారం మండలంలోని పలు రౌడీ షీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. భవిష్యత్‌లో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా జీవించాలని వారికి తెలియజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవలోనే ఆనందం


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


హాజరైన ప్రజలు

చీరాల టౌన్: సమాజ సేవ, ఆధ్యాత్మిక, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రతి ఒక్కరికి సేవ చేయడమే శ్రీరామానంద సరస్వతి ట్రస్ట్ లక్ష్యమని ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని వాడరేవు గ్రామంలోని రామానంద సరస్వతి ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత మెగా షుగరు వ్యాధి శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాలకు చెందిన 550 మంది ఈ ఉచిత షుగరు వైద్య శిబిరానికి హాజరు కాగా వీరికి డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ లలిత ప్రకాష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కృష్ణారావు, శంకరరావు, సురేష్, బసవరావు, శ్రీనివాస్, కామేశ్వరరావు, గోపాల్, కుమార్, గ్రామస్తులు, ఆశ్రమ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

25న చీరాలలో ఐక్యతా విజయపథం పాదయాత్ర

చీరాల: మాజీ ఐఏఎస్ విజయకుమార్ చేపట్టిన ఐక్యతా విజయపథం పాదయాత్ర బుధవారం చీరాల పట్టణంలోకి చేరుకుంటుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఇప్పటికి సుమారు 1100 కిలో మీటర్లు పూర్తి చేసుకుందన్నారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు వేటపాలెం, దేశాయిపేట, జాండ్రపేట, సాల్మన్‌సెంటర్, గడియార స్తంభం సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, జాన్‌పేట, జయంతిపేట, మరియమ్మపేట, ఐక్యనగర్, విజయనగర్ కాలనీల్లో పాదయాత్ర సాగుతుందన్నారు.

కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాస్త్రి, కె.ప్రకాష్, రత్నరాజు, జిలాని, బహుజన నాయకులు చప్పిడి రాము, వినోద్, దేవదానం, పి.వసంతరావు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు పర్చూరు నుంచి బొబ్బేపల్లి వరకు బైక్ ర్యాలీ

చినగంజాం/మార్టూరు: టీడీపీ పాలనలో నీరు-చెట్టు కార్యక్రమంలో జరిగిన అవినీతి గురించి ప్రజలకు వివరించేందుకు సోమవారం ఉదయం 8 గంటలకు పర్చూరు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ ఉంటుందని ఆ పార్టీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బైక్ ర్యాలీ పర్చూరు వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి యద్దనపూడి, డేగర్లమూడి, మార్టూరు మీదుగా రాజుగారిపాలెం గ్రామాల మీదుగా బొబ్బేపల్లి చేరుకోనున్నట్లు తెలిపారు. అనంతరం బొబ్బేపల్లిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆమంచి మాట్లాడతారని తెలిపారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, మండల కన్వీనర్‌లు, జేసీఎస్ కన్వీనర్‌లు, గృహసారథులు, వలంటీర్‌లు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని వారు కోరారు. ఐ

నేటి నుంచి నీరు-చెట్టు చెరువుల సందర్శన



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

పర్చూరు (చినగంజాం): టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు కార్యక్రమంలో అవినీతి జరిగిన చెరువుల సందర్శన ఉంటుందని పర్చూరు వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కోట హరిబాబు తెలిపారు. ఆదివారం పర్చూరు పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం నీరు-చెట్టు కార్యక్రమంలో అవినీతి జరిగిన చెరువులు, కుంటలను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ స్వయంగా పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం నుంచి ప్రతి గ్రామంలో ఉన్న చెరువుల సందర్శన కార్యక్రమం ప్రారంభమవుతుందని వివరించారు. ఇందులో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇంకొల్లు మండల కన్వీనర్ బందారు ప్రభాకరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ ముప్పాళ్ల రాఘవయ్య, నాయకులు ఒగ్గిశెట్టి ప్రసాద్, మల్లా శ్రీనివాసరావు, బాబునాయక్, షేక్ కాలేష, సన్నీ తదితరులు పాల్గొన్నారు,

ప్రకృతి వ్యవసాయ సేద్యం ఉత్తమం


కషాయం తయారు చేసి చూపుతున్న ట్రైనర్ అప్పారావు

పర్చూరు (చినగంజాం): మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై మాస్టర్ ట్రైనర్ సీహెచ్ అప్పారావు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు బెట్ట పరిస్థితులను అధిగమించేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు అందరూ ఆచరించాలని సూచించారు. మిరప పంట విత్తనం లేక నారు దశ నుంచి బీజామృతంతో శుద్ధిచేసుకొని నాటడం వలన తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. పంటకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, పంచగవ్య వాడుటం వలన బెట్ట పరిస్థితుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రైతు గోరంట్ల సీతారామయ్యకు కోడిగుడ్డు, నిమ్మద్రావణ కషాయాన్ని రైతుల సమక్షంలో చేసి చూపించారు. కార్యక్రమంలో మోహన్, సుజాత, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

అద్దంకిలో 27న జాబ్‌మేళా

బల్లికురవ: ప్రభుత్వం నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయం ఈనెల 27 శనివారం ఉదయం అద్దంకిలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు బల్లికురవ వైఎస్సార్ కేపీ ఏపీఎం బీ. సురేంద్రబాబు ఆదివారం తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, బీటెక్, డిగ్రీ చదివిన నిరుద్యోగులు ఈ జాబ్ మేళాకు హాజరుకావచ్చని కోరారు. ప్రముఖ 20 కంపెనీలు నిరుద్యోగులకు ఉపాధి అవకావాలు కల్పిస్తాయని బల్లికురవ తోపాటు పరిసర మండలాల్లోని నిరుద్యోగులంతా ధ్రువీకరణ పత్రాలతో మేళాకు సకాలంలో హాజరు కావాలని ఏపీఎం కోరారు.

జవాన్ కుటుంబాన్ని పరామర్శించిన ఎస్సై


జవాన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎస్సై సురేష్

చినగంజాం: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని మున్నంవారిపాలెం గ్రామంలో దేశం కోసం ప్రాణాలర్పించిన ఆర్మీ జవాన్ కోకి వెంకటేశ్వర్లురెడ్డి కుటుంబాన్ని ఎస్‌ఐ కే సురేష్ ఆదివారం పరామర్శించారు. 25 సెప్టెంబర్ 2009 మద్రాస్ సెగ్మెంట్‌లో పనిచేసే కోకి వెంకటేశ్వర్లు రెడ్డి జమ్ము, కాశ్మీర్‌లో మంచులో కూరుకుపోయి దేశం కోసం ప్రాణాలర్పించి అమరుడైన వారి కుటుంబాన్ని ఎస్‌ఐ సురేష్ పరామర్శించి వారి కుటుంబానికి పండ్లు అందజేశారు. ఎటువంటి సాయం కావలన్నా తనను సంప్రదించాలని కుటుంబ సభ్యులకు సూచించారు.



వైదనలో ముగిసిన కొలుపులు


గ్రామోత్సవానికి హాజరైన ప్రజలు

బల్లికురవ: మండలంలోని వైదన గ్రామంలో మూడు దశాబ్దాల తదుపరి చేపట్టిన పోలేరమ్మ తల్లి కొలుపులు ఆదివారంతో ముగిశాయి. పదిరోజుల క్రితం గత శనివారం శక్తి కొలుపులతో వేడుకలకు అంకురార్పణ చేశారు. బుధవారం గ్రామ దేవతలైన కనకదుర్గమ్మ తల్లి కొలుపులు నైవేద్యం, గురువారం మద్దిరాలమ్మ కొలుపులు నైవేద్యం, శుక్రవారం శతాబ్దం క్రితం నాటిన వేపచెట్టు మహాలక్ష్మమ్మ కొలుపులు నైవేద్యం, శనివారం నాభిశిల కొలుపులు, ఆదివారం పోలేరమ్మకు గ్రామోత్సవంతో కొలుపులు ముగింపు నైవేద్యం మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు. వేడుకలకు బంధువులు తరలి రావటంతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది.

పేద మహిళలకు చీరలు పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న రోటరీ అధ్యక్షుడు

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం 100 మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమం పట్టణంలోని నర్రావారిపాలెంలోని కల్యాణ మండపంలో రిటైర్డ్ తహసీల్దార్ తాతా సుబ్రహ్మణ్యం సౌజన్యంతో రోటరీ ప్రెసిడెంట్ చిన్ని మురళీ ఆధ్వర్యంలో నిర్వహించారు. తరువాత పోలియోపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలియో రహిత సమాజం కోసం ఈ నెల 24న నిర్వహించనున్న శిబిరంలో ప్రతి బిడ్డకు పోలియో చుక్కలు వేయించాలని చెప్పారు. కార్యక్రమంలో నర్రా శ్రీలక్ష్మి, తమ్మన శ్రీనివాసరావు, బీ రామాంజనేయులు, బొజ్జా విజయ్, పాల్గొన్నారు.

34వ యూత్ క్రిస్మస్ కాంపిటీషన్స్

చీరాల రూరల్: పేరాల సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ బ్రాంచ్ చర్చి పేరాలలో సోమవారం 34వ యూత్ క్రిస్మస్ కాంపిటీషన్స్ నిర్వహించనున్నట్లు చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్ ఆదివారం తెలిపారు. ఈపోటీలకు ఆంధ్ర ఇవాలంజికల్ లూథరన్ సంఘంలోని (ఏఈఎల్‌సీ) సుమారుగా 50కి పైగా లూథరన్ చర్చిల నుంచి యువతీ, యువకులు పాల్గొంటారని చెప్పారు.